# ఆయన మనకు ప్రవక్తలను అనుగ్రహించాడు

నాలుగవ పాఠము

## నిబంధనల క్రియాశీలకములు

Manuscript

thirdmill

Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.

# విషయ సూచిక


ఉపోద్ఘాతము ..... 1
నిబంధనా ఆదర్శకములు ..... 1
నిబంధనా నిర్మాణములు ..... 2
ప్రవచానాత్మక పరిచర్య ..... 6
నిబంధనా తీర్పు ..... 7
తీర్పుల రకములు ..... 8
ప్రకృతి ద్వారా తీర్పు ..... 8
యుద్ధము ద్వారా తీర్పు ..... 9
తీర్పు ప్రక్రియ ..... 10
దేవుని సహనము ..... 10
పెరుగుతున్న తీవ్రత ..... 11
ప్రత్యేకమైన ముగింపు ..... 11
నిబంధనా ఆశీర్వాదములు ..... 13
ఆశీర్వాదముల రకములు ..... 13
ప్రకృతి ద్వారా ఆశీర్వాదము ..... 13
యుద్ధము ద్వారా ఆశీర్వాదము ..... 14
ఆశీర్వాదముల ప్రక్రియ ..... 15
కృప ..... 15
పరిమాణం ..... 16
ముగింపు ..... 16
ముగింపు ..... 18





వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# ఆయన మనకు ప్రవక్తలను అనుగ్రహించాడు

నాలుగవ పాఠము

నిబంధనల క్రియాశీలకములు

## ఉపోద్ఘాతము

మానవ సంబంధములలో కొన్ని ఒడిదుడుకులు ఉంటాయని మీరెప్పుడైనా గమనించారా? స్నేహాలు కొన్నిసార్లు ఆనందకరముగాను మరికొన్నిసార్లు దుఃఖకరముగాను ఉంటాయి. కొన్నిసార్లు అవి సురక్షితముగాను మరికొన్నిసార్లు అసురక్షితముగాను ఉంటాయి. పాత నిబంధన ప్రవక్తలు ఆయన ప్రజలతో దేవుడు చేయు నిబంధనలకు ప్రతినిధులుగా ఉన్నారు అని మునుపటి పాఠములలో మనం చూశాము, మరియు ఈ ప్రతినిధిత్వ పాత్రను అర్థము చేసుకొనుటకు, ఇశ్రాయేలు మరియు దేవునికి మధ్య ఉన్న సంబంధములో ఒడిదుడుకులు ఉన్నాయను విషయమును ప్రవక్తలు గ్రహించినట్లు మనం అర్థం చేసుకోవాలి.

ఈ పాఠమునకు మనము "నిబంధనా క్రియాశీలకములు" అను పేరు పెట్టాము. ఈ పాఠములో, మూడు వేర్వేరు అంశములను మనము చూడబోవుచున్నాము: మొదటిగా, నిబంధనా ఆదర్శకములను మనము విశదీకరిద్దాము. మరియు రెండవదిగా, నిబంధనా తీర్పును పరిశీలించుదాము – ప్రజలు దైవిక తీర్పును ఎదుర్కొన్నప్పుడు ప్రవక్తలు దేవుని పక్షమున ఎలా సేవ చేశారు? మరియు మూడవదిగా, మనము నిబంధనా ఆశీర్వాదములను పరిశీలించుదాము – దేవుడు తన ప్రజలకు ఇచ్చిన ఆశీర్వాదములను గూర్చి ప్రవక్తలు ఎలా మాట్లాడారు? నిబంధన జీవితము యొక్క ఈ క్రియాశీలకములను గ్రహించుట పాత నిబంధనను మరియు నేటి సంఘముకు మరియు ప్రపంచముకు దాని యొక్క అనువర్తనమును అర్థము చేసుకొనుటలో సహాయపడుతుంది. యెహోవాతో కలిగియున్న నిబంధనా జీవితము యొక్క ప్రాథమిక ఆదర్శకములు ఏమిటి?

## నిబంధనా ఆదర్శకములు

మీరు ఎప్పుడైనా వివాహమునకు వెళ్లి వధూవరులు ఇరువురు ఒకరితో నొకరు చేసుకొనే అద్భుతమైన ఒడంబడికలను విన్నారా? "వ్యాధియందును మరియు ఆరోగ్యమందును, ఉన్ననూ లేకపోయిననూ, నీతో ఉంటాను మరియు నిన్ను విడువను." వధూవరులు ఇరువురూ తమ వైవాహిక జీవితములను ఆదర్శకముల కంటే తక్కువగా ఉన్న ప్రమాణములతో ఆరంభించుటను గూర్చి వినుట వింతగా ఉంటుంది కదా? "నేను నిన్ను నా భార్యనుగా అంగీకరించుచున్నాను, కాని నిజానికి నీకు అనారోగ్యము వస్తే నిన్ను వెన్నంటి ఉండడం చాలా కష్టంగా ఉంటుంది," అని పురుషుడు స్త్రీతో చెప్పడం మీరు ఊహించగలరా? లేదా "నేను నిన్ను నా భర్తనుగా అంగీకరించుచున్నాను, కాని మనలను పేదరికములోనికి మాత్రం ఈడ్చుకెళ్లవద్దు" అని స్త్రీ, పురుషునితో చెప్పడం మీరు ఊహించగలరా? అలాజరిగితే, తమ పెళ్లి రోజున వధూవరులిరువురు ఒకరితోనొకరు ఆ విధంగా ఎందుకు ఒడంబడికలు చేసుకున్నారు అని మనం ఆశ్చర్యపోతాము, ఎందుకంటే వివాహ జీవితము యొక్క ఆరంభము



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి.

ఆదర్శముల మీద ఆధారపడియుండాలని మనం ఆశిస్తాము. ఇది ఒక నూతనమైన సంబంధముగా ఉంది. ఇది, విషయాలు ఎలా ఉండవలసి ఉన్నవో అదే విధంగా ఉండవలసినటువంటి సమయంగా ఉంది. సంబంధము అనేది ఆదర్శకముగా ఉన్నప్పుడే ఈ జంట ఒకరితో ఒకరు చేసుకున్న ఒడంబడికలను జ్ఞాపకముంచుకొంటారని అందరము ఆశిస్తాము.

ఏదిఏమైనా, దేవునికి మరియు ఆయన ప్రజలకు మధ్య సంబంధము విషయములో ఇటువంటిదే వాస్తవమైయుండినది అని పాత నిబంధన ప్రవక్తలకు తెలుసు. దేవునికి మరియు ఇశ్రాయేలుకు మధ్య నిబంధన సంబంధములో నిర్దిష్టమైన ఆదర్శకములు ఉన్నాయని వారు అర్థం చేసుకున్నారు. ఈ ఆదర్శ సంబంధమును అర్థము చేసుకోవాలంటే, మనము రెండు అంశములను చూడాలి: మొదటిగా, ప్రాథమిక ఆదర్శ నిబంధనా నిర్మాణములు; రెండవదిగా, ప్రవచనాత్మక పరిచర్యలు, లేదా ప్రవక్తలు ఈ నిర్మాణముల మీద ఎలా ఆధారపడ్డారు.

## నిబంధనా నిర్మాణములు

మునుపటి పాఠములలో, ఇశ్రాయేలుతో యెహోవా చేసిన ఒప్పందములు ప్రాచీన పశ్చిమ ఆసియాలోని ప్రభువు-సామంత ఒప్పందములను పోలినవిగా ఉన్నట్లు పాత నిబంధన వివరిస్తుంది అని చూశాము. పాత నిబంధన కాలములో, గొప్ప చక్రవర్తులు చిన్న రాజ్యములతో ఒప్పందములను లేదా నిబంధనలను చేసుకొనేవారు, మరియు యెహోవా ఇశ్రాయేలు రాజ్యముతో ఇటువంటి నిబంధననే చేశాడు అని బైబిలు చెబుతుంది. చక్రవర్తులు మొదటిగా తమ సామంత రాజ్యములతో ఒప్పందము కుదుర్చుకున్నప్పుడు, వారు తమ రాజకీయ ఏర్పాట్ల యొక్క ప్రాథమిక నిర్మాణములను రూపొందించే కొన్ని ఆదర్శకములను ప్రకటించుట ద్వారా ప్రారంభించేవారు.

ప్రభువు-సామంత ఒప్పందములలో కనీసము రెండు భాగములు ఉన్నాయి. మొదటిగా, ప్రాచీన పశ్చిమ ఆసియా ఒప్పందములు ఎల్లప్పుడు చక్రవర్తి తన సామంతుల యెడల చూపిన దయను ధృవీకరిస్తాయి. వారు గొప్ప రాజు యొక్క పేరును ప్రకటించి, ఆ రాజు తన ప్రజల కొరకు చేసిన గొప్ప కార్యములన్నిటిని వివరించే చారిత్రిక వృత్తాంతమును తెలియజేస్తూ ఆరంభించేవారు. ఒప్పందములు ఎల్లప్పుడు చక్రవర్తి యొక్క దయ మీద ఆధారపడతాయి, మరియు చక్రవర్తి యొక్క దయ అను ఈ అంశము బైబిలులోని నిబంధనా ఆదర్శకములో కూడా కనిపిస్తుంది. ఆయన ప్రజల యెడల దేవుడు కలిగియున్న దయ బైబిలులోని ప్రతి దైవిక నిబంధనలోని ముఖ్యభాగమైయున్నది.

నిబంధన ఆదర్శకములలో మనం ఎప్పటికీ మరచిపోకూడని మరొక అంశము ఉంది, అదేమనగా మానవుని బాధ్యత అను అంశము. ప్రాచీన ప్రపంచములోని ప్రభువు-సామంత ఒప్పందములు చక్రవర్తి యొక్క సామంత రాజ్యము నుండి స్వామిభక్తిని ఆశించేవి, అదే విధముగా పాత నిబంధనలోని ప్రతి ఒక్క నిబంధన కూడా దేవుని ప్రజల నుండి స్వామిభక్తిని కోరుతుంది. స్వామిభక్తికి చూపు ప్రతిస్పందన ఎల్లప్పుడు ఒక ప్రతిస్పందనగానే అనగా దేవుని దయకు ప్రతిస్పందనగా ఉండేది – దేవుని యెదుట ప్రజలు తమ హోదాను సంపాదించుకొనలేరు. దేవుడు ఆయన యొక్క కృపను ఆధారము చేసుకొని తన ప్రజలకు నిబంధనను స్థిరపరచేవాడు. ఎటువంటి మినహాయింపు లేకుండా, నిబంధనా ఆదర్శకములు ఎల్లప్పుడు మానవ బాధ్యతను కోరేవి – దేవుని యెదుట స్వామిభక్తితో జీవించవలసిన అవసరత.

ఈ సమయంలో, ఈ ఆదర్శక అంశములలో ప్రతిది పాత నిబంధనలోని ప్రతి నిబంధనలో ఏ విధంగా భాగమైయున్నదో మనం ఆలోచన చేయాలి. మునుపటి పాఠములలో మనము చూచినట్లుగా, దేవుడు ఐదు నిబంధన సంబంధములను కలిగియున్నాడను విషయమును పాత నిబంధన ప్రవక్తలు అర్థం చేసుకున్నారు. ఆదాము మరియు నోవహుల ద్వారా భూమియందున్న సమస్త రాజ్యములతో ఆయన నిబంధనలను స్థిరపరచాడు. అటుతరువాత అబ్రాహాము, మోషే మరియు దావీదు, అదే విధంగా చెర తరువాత భవిష్యత్ క్రొత్త నిబంధన ద్వారా ఆయన ఇశ్రాయేలును ఒక ప్రత్యేక సంబంధములోకి పిలచాడు.

ఆదాముతో చేసిన నిబంధనను గూర్చి ఒక నిమిషం ఆలోచించండి. ఆదాము కాలములో, మానవాళి కొరకు లోకమును సృష్టించు విధానములో దేవుని దయ కనుపరచబడింది. ఆయన జనవాసము లేని, అస్తవ్యస్తమైన సృష్టిని తీసుకొని దానిని మానవులు నివసించే ఒక అందమైన వనముగా రూపించాడు. ఆదికాండము 1:2లో మనము ఇలా చదువుతాము:

> భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండెను; చీకటి అగాధ జలము పైన కమ్మియుండెను; దేవుని ఆత్మ జలముల పైన అల్లాడుచుండెను (ఆదికాండము 1:2).

అప్పుడు దేవుడు ఆయన స్వరూపము కొరకు ఒక పరదైసును చేసి అందులో ఆదాము హవ్వలను ఉంచాడు. ఈ దయను ఆధారము చేసుకొని దేవుడు మన మొదటి తల్లిదండ్రులైన ఆదాము హవ్వలతో నిబంధనను స్థిరపరచాడు. అదే సమయంలో, ఆదాముతో చేసిన నిబంధనా ఆదర్శకములో మానవుని యొక్క బాధ్యత అవసరమై ఉండెను. దేవుడు ఆదామును అందమైన ఏదెను వనములో ఉంచాడు, కాని వెంటనే తీవ్రమైన నియమాలను ఇచ్చాడు. ఆదికాండము 2:16-17లో, మనము ఈ మాటలను చదువుతాము:

> మరియు దేవుడైన యెహోవా ఈ తోటలోనున్న ప్రతి వృక్ష ఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును; అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను (ఆదికాండము 2:16-17).

పరదైసులో కూడా, నిబంధన ఆదర్శకములలో దేవుని దయతో పాటుగా మానవాళికి బాధ్యత కూడా ఇవ్వబడింది.

అలాగే, నోవహుతో చేసిన నిబంధనలో కూడా ఇదే వాస్తవమై ఉంది. ఒకవైపు, దేవుడు నోవహును మరియు అతని కుటుంబమును ప్రపంచ జలప్రళయం నుండి దయతో రక్షించాడు. ఆదికాండము 6:7-8లో ఈ విధంగా వ్రాయబడింది:

> అప్పుడు యెహోవా నేను సృజించిన నరులును ... భూమిమీద నుండకుండ తుడిచివేయుదును; అయితే నోవహు యెహోవా దృష్టియందు కృప పొందినవాడాయెను (ఆదికాండము 6:7-8).



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

నోవహుతో చేయబడిన నిబంధన అనర్హమైనవారిపై చూపబడిన దేవుని దయ మీద ఆధారపడి ఉంది. అయినప్పటికీ, దేవుడు నోవహుతో చేసిన నిబంధన దేవుని దయ మరియు కనికరమును మానవుని బాధ్యతతో జతపరుస్తుంది. జలప్రళయం తరువాత నోవహు ఓడ నుండి వెలుపలకు వచ్చినప్పుడు, దేవుడు అనేకమైన నియమములను ఇచ్చాడు. ఆదికాండము 9:7లో, దేవుడు నోవహు యొక్క ప్రాథమిక మానవ బాధ్యతను అతనికి జ్ఞాపకం చేశాడు:

> మీరు ఫలించి అభివృద్ధి నొందుడి; మీరు భూమిమీద సమృద్ధిగా సంతానము కని విస్తరించుడని వారితో చెప్పెను (ఆదికాండము 9:7).

దేవుని దయ మరియు మానవుని బాధ్యత నోవహు నిబంధనలో కనిపిస్తాయి.

ఇప్పుడు, దేవుడు ఇశ్రాయేలుతో చేసిన ప్రత్యేక నిబంధనలను ఒక క్షణం ఆలోచన చేద్దాము. ఇశ్రాయేలుతో చేయబడిన మొదటి నిబంధన పితరుడైన అబ్రాహాముతో చేయబడిందని మీరు జ్ఞాపకం చేసుకొనవచ్చు. ఈ నిబంధనలో దేవుని దయ కనిపిస్తుంది ఎందుకంటే భూమియందున్న కుటుంబములన్నిటిలో ఆశీర్వాదకరముగా ఉండుటకు దేవుడు ఈ ఒక్క కుటుంబమును ఏర్పాటు చేసుకున్నాడు. ఆదికాండము 12:2-3లో ఈ మాటలను పలికినప్పుడు దేవుడు అబ్రాహాము యెడల గొప్ప దయను కనుపరచాడు.

> నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను; భూమియొుక సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును (ఆదికాండము 12:2-3).

మరోసారి, నిబంధనా ఆదర్శకములో దేవుని దయ అనేది ముఖ్యమైన విషయముగా ఉంది. అయినప్పటికీ, అబ్రాహాము నిబంధన యొక్క ఆదర్శకములో మానవ బాధ్యత అను అంశము కూడా ముఖ్యమైన భాగముగా ఉంది. అనేక సందర్భములలో, పితరుని యొక్క బాధ్యత ప్రాముఖ్యత సంతరించుకుంది. ఉదాహరణకు, ఆదికాండము 17:1-2లో, దేవుడు ఇలా సెలవిచ్చాడు:

> నేను సర్వశక్తిగల దేవుడను; నా సన్నిధిలో నడుచుచు నిందారహితుడవై యుండుము. నాకును నీకును మధ్య నా నిబంధనను నియమించి నిన్ను అత్యధికముగా అభివృద్ధి పొందించెదనని అతనితో చెప్పెను (ఆదికాండము 17:1-2).

అబ్రాహాము నిబంధనలో మానవ బాధ్యత కూడా ఉంది.

నేడు అనేకమంది క్రైస్తవులకు మోషే నిబంధన పట్ల తప్పుడు అభిప్రాయం ఉంది. ఈ నిబంధన క్రియల ఆధారమైనది అని వారు నమ్ముతారు, కాని అది నిజము కాదు. మరియు ప్రాచీన పశ్చిమ ఆసియాలోని ప్రభువు ఒప్పందముల వలెనే, పది ఆజ్ఞలు కూడా చారిత్రిక పరిచయముతో ఆరంభమౌతాయి అను వాస్తవములో దీనిని మనం స్పష్టంగా చూడవచ్చు. ఆజ్ఞలను ఇచ్చుటకు ముందు, నిర్గమకాండము 20:2లో మనము ఈ మాటలు చదువుతాము:



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

> నీ దేవుడైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తుదేశములో నుండి నిన్ను వెలుపలకి రప్పించిచితిని (నిర్గమకాండము 20:2).

ఐగుప్తు దేశములో నుండి వారిని వెలుపలికి రప్పించిన ఆయన యొక్క కనికర కార్యమును ఆధారము చేసుకొని ఆయన ప్రజలు ఆయనకు విధేయత చూపాలని దేవుడు ఆశించాడు. వాస్తవంగా చెప్పాలంటే, మోషే నిబంధనలో మానవుని బాధ్యతతో పాటుగా మరో కోణము కూడా ఉంది. నిర్గమకాండము 19:5 ఇశ్రాయేలుకు ఈ మాటలను చెబుతుంది:

> కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచినయెడల, మీరు సమస్త దేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు (నిర్గమకాండము 19:5).

మోషేతో చేయబడిన నిబంధన యొక్క ఆదర్శక దశలో దేవుని దయ అనేది మానవుని బాధ్యతతో పాటు కలిసి ఉంది.

ఇప్పుడు, దావీదుతో చేయబడిన రాచరిక నిబంధన కూడా దేవుని దయ మీద ఆధారపడి ఉంది. 2 సమూయేలు 7:8లో దేవుడు దావీదుతో ఇలా మాట్లాడాడు:

> గొర్రెల కాపులోనున్న నిన్ను గొర్రెల దొడ్డిలోనుండి తీసి ఇశ్రాయేలీయులను నా జనులమీద అధిపతిగా నియమించితిని (2 సమూయేలు 7:8).

దేవుడు దావీదు కుటుంబమును ప్రేమతో తన ప్రజల మీద శాశ్వత రాజవంశముగా ఎన్నుకున్నాడు గాని, దావీదులో ఆయన చూసిన యోగ్యత వలన కాదు. దేవుడు అతని యెడల దయగలిగి ఉన్నాడు గనుక దావీదు సామ్రాజ్యము స్థిరపరచబడింది. అదే సమయంలో దేవుడు, దావీదు యెడల కనుపరచబడిన ఈ దయను మానవుని స్వామిభక్తితో కలిపాడు. కీర్తనలు 89:30-32లో స్వామిభక్తి యొక్క ఆవశ్యకములు
నిర్దేశించబడిన విధానమును వినండి:

> అతని [దావీదు] కుమారులు నా ధర్మశాస్త్రము విడిచి నా న్యాయవిధుల నాచరింపనియెడల, వారు నా కట్టడలను అపవిత్రపరచి నా ఆజ్ఞలను గైకొననియెడల, నేను వారి తిరుగుబాటునకు దండముతోను వారి దోషమునకు దెబ్బలతోను వారిని శిక్షించెదను (కీర్తనలు 89:30-32).

దావీదు కుమారులకు ఆయన చూపిన దయను గుర్తిస్తూ ఆయనకు నమ్మకముగా ఉండాలని దేవుడు ఆశించాడు.

నిబంధనా ఆదర్శకము యొక్క రెండు కోణములు క్రొత్త నిబంధనలో కూడా కనిపిస్తాయి, ఇవి మెస్సీయ ద్వారా వస్తాయని ప్రవక్తలు ప్రవచించారు. ఎఫెసీయులకు 2:8-10లో అపొస్తలుడైన పౌలు దీనిని క్లుప్తంగా చెప్పాడు:



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

> మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినదికాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు (ఎఫెసీయులకు 2:8-9).

కృప అనేది క్రీస్తులో నిబంధనకు ఆధారముగా ఉంది. వచనము 10లో ఉన్న మాటలను ఇప్పుడు వినండి:

> మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తుయేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము (ఎఫెసీయులకు 2:10).

క్రొత్త నిబంధన ఆదర్శకములో కూడా సత్రియలు చేయాలను మానవుని బాధ్యత ఉంది.

ఈ సమయంలో, మనము రెండవ అంశము వైపు మన యొక్క దృష్టిని మరల్చాలి: ఈ నిబంధన నిర్మాణముల మీద ప్రవక్తలు ఎలా ఆధారపడ్డారు.

## ప్రవచానాత్మక పరిచర్య

ఒకవైపు, యెహోవా దేవుని ప్రజల మీద చూపిన దయను గూర్చి ప్రవక్తలు ఎలప్పుడు వారికి జ్ఞాపకం చేశారు. అయితే, అదే సమయంలో, నిబంధనలో ఉన్న మానవుని యొక్క బాధ్యత మీద కూడా పాత నిబంధన ప్రవక్తలు ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించారు. ప్రజలను సమీపించి, స్వామిభక్తి యొక్క అవసరతను గూర్చి వారికి జ్ఞాపకం చేయుటకు, వారు దేవుని చేత పిలువబడ్డారు. దృశ్యమైన ఇశ్రాయేలు సమాజములో విశ్వాసులు మరియు అవిశ్వాసులు ఉన్న విషయం ప్రవక్తలకు తెలుసు అని మనం ఎల్లప్పుడు జ్ఞాపకం ఉంచుకోవాలి. మరియు ఈ కారణమును బట్టి, వారు నిబంధనలోని మానవ బాధ్యతను ఒక పరీక్షగా లేదా రుజువుగా పరిగణించారు. నిబంధనా షరతుల యెడల ప్రజల యొక్క ప్రతిస్పందన తమ హృదయముల యొక్క నిజమైన స్వభావమును చూపించింది.

ఒకవైపు, దృశ్యమైన సమాజములోని అవిశ్వాసులు తమ యొక్క నిబంధన బాధ్యతల నుండి తొలగిపోతారు గనుక తమకు రక్షించు విశ్వాసము లేదని చూపించారు. రక్షణ కొరకు యెహోవాను నమ్ముటలో వారు విఫలమయ్యారు, మరియు వారు తమ స్వామిభక్తిని చూపుటకు తిరస్కరించారు. ఈ స్పష్టమైన నిబంధనను ఉల్లఘించినవారు దేవుని తీర్పును అనుభవిస్తారు. మరోవైపు, మానవుని బాధ్యత అను పరీక్ష నిజముగా అదృశ్యమైన సమాజములో ఉన్నవారిని కూడా గుర్తించింది. ఇప్పుడు, వీరు శాశ్వతంగా విమోచించబడిన ప్రజలు. వారు యెహోవాయందు రక్షించు కృపను కాపాడుకున్నారు, మరియు వారు నిత్యజీవపు మార్గములో ఉన్నారు. వాస్తవం ఏమిటంటే, క్రొత్త నిబంధన వలెనే, తమ విశ్వాసము నిరూపించుకోవాలని చాలామంది ప్రవక్తలు ఈ ప్రజలను సవాలు చేశారు. ప్రకటన 2:7లోని మాటలను వినండి:

> చెవిగలవాడు ఆత్మ సంఘములతో చెప్పుచున్నమాట వినునుగాక. జయించు వానికి దేవుని పరదైసులో ఉన్న జీవవృక్షఫలములు భుజింప నిత్తును (ప్రకటన 2:7).



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

మనకు నిజముగానే రక్షించు విశ్వాసము ఉందని నిరూపించుకోడానికి మనము దేవునికి విధేయులై ఉండాలి అను ఈ విధమైన అంశము, ప్రవచన గ్రంథములన్నిటిలో కొనసాగుతున్న అంశముగా ఉంది.

ప్రవక్తలు మానవుని యొక్క బాధ్యతను ఉద్ఘాటించారు కాబట్టి న్యాయవాధులుగా ఉన్నారని భావించకుండా ఉండుటకు మనం ఇప్పుడు జాగ్రత్తగా ఉండాలి. వాస్తవం ఏమిటంటే, విధేయత మరియు నమ్మకమైన ప్రతి కార్యము వెనుక దేవుని దయ ఉందని ప్రవక్తలు అర్థం చేసుకున్నారు. దేవుని ఆత్మ తమలో కార్యము చేస్తున్న విధానమును బట్టి ప్రజలు ఆయనకు నమ్మకముగా ఉంటున్నారు అని లేఖనము యొక్క బోధనయంతటి నుండి కూడా ఇది మనకు అర్థమౌతుంది. అయితే, అదే సమయంలో, విధేయత చూపాలన్న మన బాధ్యతను కూడా బైబిలు తరచూ మనకు జ్ఞాపకం చేస్తుంది. మరియు ప్రతి విధేయత కార్యము వెనుక దేవుని దయ ఉందని ప్రవక్తలకు తెలుసు కాబట్టి, దేవుని ప్రజలను విధేయత మరియు నమ్మకత్వము కొరకు పిలచుటలో వారు వెనుకాడలేదు.

నిబంధనా క్రియాశీలకములను గూర్చిన మన పరిశీలనలో ఇప్పటివరకు మనము, నిబంధనా ఆదర్శకము యొక్క రెండు కోణములను చూశాము. ఈ సమయంలో, మనము మన యొక్క రెండవ అంశమును చూద్దాము, అది నిబంధనా తీర్పు. దేవుని ప్రజలు యెహోవాను సేవించుట నుండి వెనుదిరిగినప్పుడు నిబంధనా జీవితము యొక్క క్రియాశీలకములు ఏమైయుండెను?

## నిబంధనా తీర్పు

ప్రపంచమంతటా మానవుని ప్రభుత్వముకు అనేక రూపాలు ఉన్నాయి. అయితే ప్రతి మానవ ప్రభుత్వములోనూ ఒక విషయం సాధారణంగా కనిపిస్తుంది: ఆ ప్రజలు తమ చట్టములన్నిటినీ పాటించరు, మరియు తత్ఫలితంగా, వారు నేరము మరియు శిక్షను గూర్చిన వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. ఇశ్రాయేలుతో దేవుడు చేసిన నిబంధన విషయంలో కూడా ఇదే వాస్తవమై ఉంది. ఆయన ప్రజలు పాపులని ఆయనకు తెలుసు. వారు ఆయన మీద తిరుగుబాటు చేస్తారని ఆయనకు తెలుసు కాబట్టి ఆయన తన ప్రజల మీద న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేశాడు. ఈ న్యాయ వ్యవస్థలో ప్రవక్తలు ప్రాముఖ్యమైన పాత్ర పోషించారు. వారు నిబంధన యొక్క దూతలుగా ఉన్నారు. వారు నేరములను జ్ఞాపకం చేశారు, మరియు ఆయన నిబంధనను ఉల్లంఘిస్తే దేవుడు తన ప్రజలకు ఇచ్చే శిక్షలను గూర్చి కూడా వారు హెచ్చరించారు. ఇప్పుడు, ప్రవక్తలు తీర్పును ప్రకటించే దూతలుగా ఎలా పని చేశారో అర్థం చేసుకొనుటకు, దేవుడు తన ప్రజల మీద ఉంచిన నిబంధనా తీర్పు యొక్క రెండు విషయాలను మనం అర్థం చేసుకోవాలి. మొదటిగా, పవక్తలు ప్రకటించిన తీర్పుల రకములను పరిశీలిద్దాము, మరియు రెండవదిగా, ఈ తీర్పులు అమలు చేయబడే ప్రక్రియను చూద్దాము. యెహోవాతో తాము చేసుకున్న నిబంధనను ఉల్లంఘించిన వారి మీద పాత నిబంధన ప్రవక్తలు ఎటువంటి తీర్పులను ప్రకటించారో మొదటిగా చూద్దాము.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

## తీర్పుల రకములు

పాత నిబంధన ప్రవక్తలు తాము ప్రకటించిన తీర్పులను తాము రూపొందించలేదు అను విషయమును గ్రహించుట చాలా ప్రాముఖ్యమైయున్నది. విరుద్ధంగా చెప్పాలంటే, ప్రజలు ఊహించే తీర్పుల రకముల యొక్క జాబితా కొరకు వారు పాత నిబంధన లేఖనాలను అనుసరించారు. ప్రవక్తలు ఉపయోగించిన పదములు మోషే గ్రంథములలోని వాక్యభాగముల మీద వారు ఆధారపడ్డారు అని వెల్లడిచేస్తాయి. దేవుని ప్రజల మీదికి వచ్చు తీర్పుల రకముల జాబితాను తయారు చేసేడప్పుడు ప్రవక్తలు ఐదు ప్రధానమైన వాక్యభాగముల మీద ఆధారపడ్డారు: దేవుడు తన ప్రజల మీదికి తెచ్చు తీర్పుల రకములను అర్థము చేసుకొనుటకు ప్రయత్నించుచుండగా ద్వితీయోపదేశకాండము 4:25-28, ద్వితీయోపదేశకాండము 28:15-68, ద్వితీయోపదేశకాండము 29:16-29, మరియు ద్వితీయోపదేశకాండము 32:15-43, మరియు చివరిగా లేవీయకాండము 26:14-39 ప్రవక్తలకు సమాచారమును అందించాయి. ఈ వాక్యభాగములలో చాలా విషయాలు ఉన్నవి గనుక వారు చెప్పిన వాటిని సంగ్రహించడం కష్టంగా ఉంటుంది. అయితే నిబంధనా తీర్పులో రెండు ప్రాథమిక వర్గములు ఉన్నాయన్న విషయమును రాజ్యముకు తెలియజేయడానికి మోషే ఈ వాక్యభాగములను వ్రాశాడు అని చెప్పడం మంచిగా ఉంటుంది.

### ప్రకృతి ద్వారా తీర్పు

మొదటి రకమైన నిబంధనా తీర్పు ఏమనగా, నిరంతర పాపముకు ప్రకృతి ద్వారా తీర్పునిస్తు దేవుడు ప్రతిస్పందించాడు. దేవుడు సహజ క్రమములో నుండి తన ఆశీర్వాదమును తొలగిస్తానని ప్రకటించాడు తద్వారా ప్రపంచం దేవుని ప్రజలకు విరుద్ధంగా మారుతుంది. దేవుడు పాలు తేనెలు ప్రవహించు దేశములోనికి ఇశ్రాయేలును రప్పించాడని మీరు జ్ఞాపకం చేసుకుంటారు. వాగ్దాన దేశములోని సహజ క్రమము దేవుని ప్రజలకు ఎంతో ఆశీర్వాదం కానుంది. అయితే ఇశ్రాయేలు తిరుగుబాటు చేసినప్పుడు, ఆయన ఈ ఆశీర్వాదమును తొలగిస్తు తీర్పుతీర్చుతాడని ప్రవక్తలు హెచ్చరించారు. ఇప్పుడు, దృశ్యమైన నిబంధన సమాజముకు వ్యతిరేకంగా ఎటువంటి ప్రకృతి తీర్పులు వస్తాయి? ద్వితీయోపదేశకాండము 4, 28, 29, మరియు 32 అదే విధంగా లేవీయకాండము 26 దేవుని ప్రజల మీదికి వచ్చిన కనీసము ఆరు ప్రకృతిపరమైన తీర్పులను గూర్చి తెలియజేస్తాయి. మొదటిగా, మోషే గ్రంథములలోని ఈ అధ్యాయములు దేవుడు కొన్నిసార్లు ఇశ్రాయేలు దేశముకు కరువును కలిగిస్తాడని చెబుతాయి. ఈ కరువు భూమిని యెండజేస్తుంది తద్వారా ప్రజలు విపరీతంగా నష్టపోతారు మరియు తెగులు వస్తుంది. ప్రజలు యెహోవాకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినప్పుడు కరువు వస్తుంది తద్వారా వారికి ఆహారం ఉండదు. మరియు వారి మీదికి రోగము వస్తుంది – వారు జ్వరాలను, గడ్డలను మరియు కణితులను, తెగుళ్లను అనుభవిస్తారు. అడవి జంతువులు మానవ ప్రాణాలకు ముప్పును కలిగిస్తాయి మరియు జనాభా నష్టం కలుగుతుంది. వాగ్దాన దేశములో సంతానలేమి మరియు అకాల మరణములు జంతువులను మరియు మానవ జనాభాను క్షీణింపజేస్తాయి.

ప్రవక్తలు ఈ విధమైన నిబంధనా తీర్పులను పదే పదే ప్రస్తావించారు. వాగ్దాన దేశములో జీవితముకు భంగం కలిగించడానికి దేవుడు ప్రకృతి విపత్తును తీసుకురాబోతున్నాడని వారు ఎల్లప్పుడు హెచ్చరించారు. ఉదాహరణకు, హగ్గయి 1:9-11లో దేవుడు యేమని చెప్పాడో వినండి:

> నా మందిరము పాడైయుండగా మీరందరు మీ మీ యిండ్లు కట్టుకొనుటకు త్వరపడుటచేతనే గదా. కాబట్టి మిమ్మునుబట్టి ఆకాశపుమంచు కురువకయున్నది, భూమి పండక యున్నది. నేను భూమికిని పర్వతములకును అనావృష్టి కలుగజేసి, ధాన్యము విషయములోను ద్రాక్షారసము విషయములోను తైలము విషయములోను భూమి ఫలించు సమస్తము విషయములోను మనుష్యుల విషయములోను పశువుల విషయములోను చేతిపనులన్నిటి విషయములోను క్షామము పుట్టించియున్నాను (హగ్గయి 1:9-11).

తీర్పు సహజమైన క్రమంలో వస్తుందని దేవుని ప్రవక్తలు ప్రకటించారు.

## యుద్ధము ద్వారా తీర్పు

ప్రకృతి ద్వారా తీర్పుతో పాటుగా, ప్రవక్తలు యుద్ధము ద్వారా తీర్పును కూడా ప్రకటించారు. యుద్ధము చాలాసార్లు కరువు మరియు రోగము వంటి సహజ భయానక పరిస్థితులను తెస్తుంది, కాని ఒక విధమైన నిబంధనా తీర్పుగా దేవుడు తన ప్రజలకు వ్యతిరేకంగా మానవులైన శత్రువులను కూడా పంపుటను గూర్చి మాట్లాడాడు. మోషే రచనలలో యుద్ధమును గూర్చిన మూలాంశములు అనేకము కనిపిస్తాయి. ద్వితీయోపదేశకాండము 4, 28, 29, 32 మరియు లేవీయకాండము 26లో, యుద్ధము ద్వారా తీర్పును గూర్చిన ఐదు ప్రధానమైన వర్గములను మనం చూస్తాము. మొదటిగా, దేవుని ప్రజలు ఓటమిని చవి చూస్తారు. వారు తమ శత్రువుల దాడుల యెదుట నిలువలేరు. రెండవదిగా, వారి నగరాలు ముట్టడి వేయబడతాయి. తమ నగరములను శత్రువులు ముట్టడివేస్తారు మరియు నగరవాసులు నష్టపోతారు. అటు తరువాత శత్రువులు వారి యొక్క దేశమును స్వాధీనము చేసుకుంటారు. దేవుని ప్రజల యొక్క శత్రువులు వాగ్దాన దేశములోకి చొరబడి, నియంత్రించడం మొదలుపెడతారు. యుద్ధములో మరణము మరియు నాశనము అనునవి మరొక నిబంధనా శాపముగా ఉన్నాయి ఎందుకంటే చాలామంది దేవుని ప్రజలు తమ శత్రువుల చేతిలో మరణిస్తారు. మరియు చివరిగా, అన్నిటికంటే ఘోరమైన శాపము – ఆయన ప్రజలు బంధీలుగా చెరగొనిపోబడి, ఆ దేశముల మధ్య చెల్లాచెదురవుతారని దేవుడు చెప్పాడు.

దేవుని ప్రజలు తమ శత్రువుల చేతిలో ఓడిపోతారని ప్రవక్తలు పదే పదే ప్రకటించడమే కాకుండా, వాగ్దాన దేశము నుండి బహిష్కరించబడతారని కూడా ప్రకటించారు. ఉదాహరణకు, చాలామంది యూదులు వాగ్దాన దేశము నుండి చెరగొనిపోబడతారని ప్రవక్తయైన మీకా హెచ్చరించాడు. మీకా 1:16లో చెరలోని మాటలను మనం చదువుతాము:

> సీయోనూ, నీకు ప్రియులగువారు నీయొద్ద నుండకుండ పట్టబడియున్నారు; నీ తల బోడిచేసికొనుము, బోరుచగద్దవలె నీ బోడితనము కనుపరచుకొనుము (మీకా 1:16).

తీర్పును మరియు యుద్ధమును గూర్చిన బెదిరింపులు పాత నిబంధన ప్రవచన గ్రంథమంతటా కనిపిస్తాయి.

కాబట్టి పాత నిబంధన ప్రవక్తలు రెండు రకముల నిబంధనా తీర్పులను ప్రధానముగా ప్రకటించుట మనం చూస్తాము: ప్రకృతి విపత్తులు మరియు యుద్ధము. దేవుడు తన ప్రజల మీద ఈ విధమైన తీర్పులను అమలుచేయుచుండగా తాను అనుసరించిన ప్రక్రియను ఇప్పుడు మనము చూద్దాము.

## తీర్పు ప్రక్రియ

తీర్పు ప్రక్రియ అనేది ఏ విధంగా ఉంటుందని ప్రవక్తలు భావించారు? ప్రవక్తలు తీర్పు ప్రక్రియను గూర్చి ప్రాథమికంగా లేవీయకాండము 26:14-39 నుండి నేర్చుకున్నారు. ఈ వాక్యభాగములో, తీర్పు అనేది ఒక సుదీర్ఘకాలము జరుగుతుంది మరియు ఒక ప్రత్యేకమైన పద్ధతిని అనుసరిస్తుంది అని మోషే వివరించాడు. ఈ వాక్యభాగమును మనం పరిశీలించుచుండగా, ఈ తీర్పులు జరిగే పద్ధతిని నియంత్రించే కనీసం మూడు సూత్రములను మనం కనుగొంటాము. దేవుడు సహనము చూపుతాడు, కాని తీర్పులు వాటి యొక్క తీవ్రతను పెంచుతాయి, మరియు ఈ తీర్పులకు ఒక ప్రత్యేకమైన ముగింపు కూడా ఉంటుంది. మొదటిగా దేవుని సహనమును గూర్చి ఆలోచన చేద్దాము.

### దేవుని సహనము

తన ప్రజలు పాపము చేసినప్పుడు దేవుడు వారిపట్ల గొప్ప సహనము కలిగియుంటాడని లేవీయకాండము 26:14-39 స్పష్టం చేస్తుంది. తన ప్రజలు తిరుగుబాటు చేసి, మొండివారిగా ఉండి, పశ్చాత్తాపపడుటకు నిరాకరిస్తారని దేవుడు గ్రహించాడు. కాబట్టి ఈ వాక్యభాగములో, దేవుడు తన ప్రజలతో సహనము కలిగి ఉంటాడని మోషే వెల్లడిచేశాడు. లేవీయకాండము ఐదు ప్రధాన భాగములుగా విభాగింపబడింది: వచనములు 14-17, 18-20, 21-22, 23-26, మరియు 27-39. ఈ ప్రతి విభాగము కూడా దేవుడు ఇలా సెలవిచ్చుటతో ఆరంభమౌతుంది: "మీరు నా మాట వినక..." మరియు అటుతరువాత తీర్పులో ఇశ్రాయేలుకు ఏమి చేస్తాడో చెప్పడం కొనసాగించాడు. "మీరు నా మాట వినక" అను పదసమూహము యొక్క పునరావృతము పశ్చాత్తాపము పొందుటకు దేవుడు వారికి అనేకమైన అవకాశములను ఇచ్చుట ద్వారా సహనము కనుపరచాడని చూపిస్తుంది.

దేవుని సహనముకు సంబంధించిన ఒక అత్యంత సంక్షిప్త వర్ణన పాత నిబంధన ప్రవచనములో కనిపిస్తుంది. యోవేలు 2లో ప్రవక్తయైన యోవేలు పశ్చాత్తాపపడుమని ప్రజలకు పిలుపునిచ్చినప్పుడు దేవుని సహనమును గూర్చి మాట్లాడాడు. 2:13లో, ఆయన ఇశ్రాయేలుకు ఈ మాటలు చెప్పాడు:

> **మీ దేవుడైన యెహోవా కరుణావాత్సల్యములుగల వాడును, శాంతమూర్తియు అత్యంతకృపగలవాడునైయుండి, తాను చేయనుద్దేశించిన కీడును చేయక పశ్చాత్తాపపడును గనుక ... ఆయన తట్టు తిరుగుడి (యోవేలు 2:13).**

నిబంధనా తీర్పు యందు ప్రవక్తలు గట్టి నమ్మకం ఉంచారు, కాని యెహోవా తన ప్రజల యెడల అత్యంత సహనముగలవాడు అని కూడా వారు నమ్మారు.

లేవీయకాండము 26లోని నిబంధనా తీర్పు యొక్క మొదటి సూత్రము ఏమనగా దేవుడు సహనముతో ఉంటాడు. అయితే రెండవ సూత్రము కూడా ఉంది – దేవుని నిబంధనా తీర్పులు పెరుగుతున్న తీవ్రతతో వస్తాయి.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

## పెరుగుతున్న తీవ్రత

దేవుడు సహనముగలవాడని లేవీయకాండము 26 యొక్క ఐదు భాగములు చెబుతున్నట్లుగానే, దేవుడు తన తీర్పుల యొక్క తీవ్రతను పెంచుతాడని కూడా అవి చెబుతాయి. వచనములు 18, 21, 24, మరియు 28లో, దేవుడు తన ప్రజలను ఇలా హెచ్చరించాడు: వారు ఆయన మీద తిరుగుబాటు చేయుట కొనసాగించినట్లైతే, ఆయన తీర్పులను ఏడుమార్లు అధికము చేస్తాడు.

లేవీయకాండము 26 యొక్క ఈ కోణము నిబంధనా తీర్పు అంచలంచలుగా వస్తుందని బోధిస్తుంది. కొన్నిసార్లు ప్రవక్తలు సాపేక్షంగా తక్కువ తీవ్రంగా ఉన్న తీర్పులను గూర్చి హెచ్చరించారు, తరువాత అధిక తీవ్రత కలిగియున్న తీర్పులను గూర్చి హెచ్చరించారు. ఉదాహరణకు, యెషయా 38:1లో తక్కువ తీవ్రత కలిగిన ఒక తీర్పును గూర్చి మనం చదువుతాము:

> నీవు మరణమవుచున్నావు, బ్రదుకవు గనుక నీవు నీ యిల్లు చక్కబెట్టు కొనుము (యెషయా 38:1).

ఇప్పుడు, ఇది గొప్ప నిబంధనా తీర్పుగా హిజ్కియా భావించాడని నా ఆలోచన, కాని రాజ్యమంతటి పరంగా, ఇది చిన్నది – కేవలం ఒక వ్యక్తి మాత్రమే దేవుని తీర్పును అనుభవించాడు. అయితే మరోవైపు, అష్షూరీయుల మీద అద్భుతముగా జయం పొందిన తరువాత కూడా హిజ్కియా యెహోవాకు విధేయత చూపుటకు తిరస్కరించినప్పుడు, యెషయా మరింత తీవ్రమైన తీర్పును ఇచ్చాడు. ఒక దినమున యూదా రాజ్యమంతటి మీద బబులోనీయులు జయం పొందుతారని అతడు ప్రకటించాడు. యెషయా 39:6లో, మనము ఈ మాటలు చదువుతాము:

> రాబోవు దినములలో ఏమియు మిగులకుండ నీ యింటనున్న సమస్తమును, ... అంతయును బబులోను పట్టణమునకు ఎత్తికొని పోవుదురు (యెషయా 39:6).

ఈ ప్రకటన హిజ్కియా యొక్క వ్యక్తిగత మరణ ప్రకటన కంటే మరింత తీవ్రమైనదిగా ఉంది. ఇది రాజ్యమంతటి మీదికి వచ్చు తీర్పు. మరియు అనేకమంది ప్రవక్తలు ఈ విధమైన పద్ధతినే అనుసరిస్తారు. వారు తీవ్రమైన తీర్పులను గూర్చి మట్లాడారు.

దేవుడు నిబంధనా తీర్పులను సహనము మరియు పెరుగుతున్న తీవ్రత ద్వారా తెచ్చాడు అని మాత్రమే మనం కనుగొనుట కాదుగాని, మూడవ సూత్రము కూడా మనం కనుగొంటాము: తీర్పు యొక్క ముగింపు ఏమనగా దేశము నుండి చెరగొనిపోబడుట.

## ప్రత్యేకమైన ముగింపు

దేవుని ప్రజల మీదికి రాబోయే భయంకరమైన తీర్పు భూమిని పూర్తిగా నాశనము చేస్తుంది మరియు వారు వాగ్దాన దేశము నుండి చెరగొనిపోబడతారని లేవీయకాండము 26:27-39 యొక్క చివరి భాగము హెచ్చరిస్తుంది. లేవీయకాండము 26:33లో దీనిని గూర్చి మోషే చెప్పిన విధానమును వినండి:

> జనములలోనికి మిమ్మును చెదరగొట్టి మీవెంట కత్తి దూసెదను, మీ దేశము పాడైపోవును, మీ పట్టములు పాడుపడును (లేవీయకాండము 26:33).

పాత నిబంధన విశ్వాసుల యొక్క మనస్సులలో, దీని కంటే ఘోరమైన మరొకదానిని ఊహించడం కష్టంగా ఉంటుంది. దేవుడు ఇశ్రాయేలును పాలు తేనెలు ప్రవహించు వాగ్దాన దేశములోకి తీసుకువచ్చాడు, ఇప్పుడు, ఈ దేశము నుండి చెరగొనిపోబడుతున్నట్లు ప్రవక్తలు ప్రకటించారు. మనము అనేకమంది బైబిలు ప్రవక్తల కాలమునకు వచ్చే సరికే, దేవుడు తన ప్రజలను దేశము నుండి పంపివేయబోతున్నానని పదే పదే హెచ్చరించాడు. కాబట్టి చెర సమీపిస్తున్నట్లు ప్రవక్తలు ప్రకటించుట మనం చూస్తాము. ఉదాహరణకు, ఆమోసు 5:26-27లో, మనము ఈ మాటలు చదువుతాము:

> మీరు మీ దేవతయైన మోలెకు గుడారమును, మీరు పెట్టుకొనిన విగ్రహముల పీఠమును మీరు మోసికొని వచ్చితిరి గదా. కాబట్టి నేను మిమ్మును చెరగొనిపోవుదును (ఆమోసు 5:26-27).

లేవీయకాండము 26లో అదే విధంగా ఇతర అనేకమైన వాక్యభాగములలో చెర అను విపత్తును గూర్చి మోషే స్పష్టము చేసినప్పటికీ, ఇశ్రాయేలు ప్రజలు నమ్మడానికి కష్టంగా భావించారు. దేవుడు తన ప్రజలను పూర్తిగా పంపివేయలేడని - కనీసం యెరూషలేమైనా నిలుస్తుంది అను నమ్మకం ప్రసిద్ధి చెందినదిగా ఉండేది. ప్రజలు యెహోవాతో చేసుకొనిన నిబంధనలో మానవుని యొక్క బాధ్యత కూడా ఇమిడియుందని మరచిపోయారు, కాబట్టి యెరూషలేము భద్రత యొక్క చివరి దినములలో కూడా, దేవాలయము మరియు నగరము నాశనము చేయబడు దినము వచ్చుచున్నదని యిర్మీయా ప్రకటింపవలసి వచ్చింది. యిర్మీయా 7:13-15లో మనము ఈ మాటలు చదువుతాము:

> నేను మీతో మాటలాడినను పెందలకడ లేచి మీతో మాటలాడినను మీరు వినకయు, మిమ్మును పిలిచినను మీరు ఉత్తరమియ్యకయు నుండినవారై యీ క్రియలన్నిటిని చేసితిరి గనుక నేను షిలోహునకు చేసినట్లు మీకు ఆశ్రయమై నా నామముపెట్టబడిన యీ మందిరమునకును మీకును మీ తండ్రులకును నేనిచ్చిన స్థలమునకును నేను ఆలాగే చేయుదును. ఎఫ్రాయిము సంతానమగు మీ సహోదరులనందరిని నేను వెళ్లగొట్టినట్లు మిమ్మును నా సన్నిధినుండి వెళ్లగొట్టుదును (యిర్మీయా 7:13-15).

దేవుడు తన ప్రజల యెడల కృపను, సహనమును మరియు దయను చూపించాడు; ఆయన కోపించడానికి చాలా సమయం పడుతుంది, కాని ఆయన కోపమును రేపవచ్చును. కాబట్టి దేవుడు తన ప్రజల యెడల తీర్పును కలిగియున్నాడని మనము కనుగొంటాము, అయితే ఆ తీర్పు సహనము మరియు దయతో కూడినదిగా ఉంటుంది.

ఈ పాఠంలో నిబంధనల క్రియాశీలకములను, నిబంధనా ఆదర్శకములను మరియు నిబంధనా తీర్పును ఇప్పటివరకు మనము చూశాము. ఇప్పుడు మన చర్చలోని మూడవ అంశమును చూచుటకు సిద్ధంగా ఉన్నాము: నిబంధనా ఆశీర్వాదములు. దేవుడు తన ప్రజల మీద ఆశీర్వాదములను ఎలా కురిపించాడు?



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

# నిబంధనా ఆశీర్వాదములు

యెదుటి వ్యక్తి మిమ్ముల్ను వీడలేనటువంటి స్నేహమును మీరెప్పుడైనా చేశారా? మీరు విడిచిపెట్టవచ్చు, మీరు స్పందించడం మరచిపోయినప్పటికీ మీ విశ్వసనీయమైన స్నేహితుడి వద్ద నుండి ఉత్తరములు లేదా ఫోను కాల్స్ వస్తూనే ఉండవచ్చు. అవును, చరిత్రయంతటా మీతో కలసియుండే అటువంటి స్నేహితులను కలిగియుండడం మంచిదే. యెహోవా మరియు ఇశ్రాయేలు మధ్య సంబంధములో ఇదే వాస్తవమై ఉంది. దేవుడు తన ప్రజలకు తీవ్రంగా తీర్పుతీర్చుతాడని ప్రవక్తలకు తెలుసు, అయితే యెహోవా తన ప్రజలను విడిచిపెట్టడు అని కూడా వారికి తెలుసు మరియు వారు దానిని ప్రకటించారు.

నిబంధనా జీవితము యొక్క ఈ కోణమును అన్వేషించాలంటే, తీర్పును పరిశీలించిన విధముగానే రెండు విషయాలను మనం గమనించాలి. మొదటిగా, నిబంధనా ఆశీర్వాదముల రకములను చూద్దాము, తరువాత నిబంధనా ఆశీర్వాదముల ప్రక్రియను చూద్దాము.

## ఆశీర్వాదముల రకములు

దేవుని ప్రజలు ఆయనకు నమ్మకముగా ఉన్నప్పుడు ఆశీర్వాదములను పొందుకుంటారు. వాస్తవంగా చెప్పాలంటే, తన ప్రజలు పరిపూర్ణులుగా ఉండాలని దేవుడు ఆశించడు, కాని ఆయన మీద తిరుగుబాటు చేయకుండా హృదయపూర్వకంగా ఆయనను వెదకాలని మాత్రం ఆశిస్తాడు. నిబంధనా ప్రజలు ఈ విధంగా నమ్మకముగా ఉన్నప్పుడు, దేవుడు వారిని బహుగా ఆశీర్వదిస్తాడు.

### ప్రకృతి ద్వారా ఆశీర్వాదము

ఆశీర్వాదములలో మొదటిది ప్రకృతి ద్వారా ఆశీర్వాదము. ప్రకృతి ద్వారా తీర్పును గూర్చి మోషే మాట్లాడినట్లుగానే, ప్రకృతి ద్వారా వచ్చు ఆశీర్వాదములను గూర్చి కూడా ఆయన మట్లాడాడు. ఇశ్రాయేలు నమ్మకముగా దేవునిని సేవించినట్లైతే, ఆయన ప్రకృతి ద్వారా అద్భుతమైన ఆశీర్వాదములను ఇస్తాడని మోషే వెల్లడిచేశాడు. ఈ విధమైన అంశము ద్వితీయోపదేశకాండము 4, 28, 30, మరియు లేవీయకాండము 26లో కనీసము నాలుగు విధాలుగా కనిపిస్తుంది. మొదటిగా, మోషే పుష్కలమైన వ్యవసాయము గూర్చి మాట్లాడాడు. ప్రజలు ప్రభువుకు నమ్మకముగా ఉంటే పొలాలు బహుగా ఫలిస్తాయి. అంతేకాకుండ, పశువుల సంతానోత్పత్తిని గూర్చి కూడా అతడు మాట్లాడాడు. ప్రజలు యెహోవాను నమ్మకముగా సేవించినట్లైతే పశువులు సంఖ్యలో పెరుగుతాయి. ఆరోగ్యము మరియు శ్రేయస్సు దేవుని ప్రజలకు అనుగ్రహించబడతాయి. వారు ఆరోగ్యమును మరియు శ్రేయస్సును ఆనందిస్తారు, మరియు అంతేకాకుండ, జనాభా కూడా పెరుగుతుంది. ఇశ్రాయేలీయుల యొక్క సంఖ్య పెరుగుతుంది తద్వారా వారు వాగ్దాన దేశమును నింపుతారు.

ప్రకృతి ద్వారా వచ్చు ఆశీర్వాదములను గూర్చిన ప్రకటనలు మనలను ఆశ్చర్యపరచకూడదు. దేవుడు మొదట మానవులను చేసినప్పుడు, ఆయన మనలను పరదైసులో ఉంచాడు – ఏదెను వనము. అయితే పాపము వలన దేవుడు మనలను వెలుపలకు పంపివేశాడు. దేవుని నిబంధనా ప్రజలు ఆయనకు నమ్మకముగా ఉన్నప్పుడు ఆశీర్వాదములు ఇస్తానని, ప్రకృతి ద్వారా ఆశీర్వాదములు

అనుగ్రహిస్తానని వాగ్దానము చేశాడు, తద్వారా ఆరంభములో మానవాళికి దేవుడు ఉద్దేశించిన విషయాలను వారు అనుభవిస్తారు. ప్రకృతి ద్వారా అనుగ్రహించబడు ఆశీర్వాదములను గూర్చి పాత నిబంధన ప్రవక్తలు అనేక విధాలుగా మాట్లాడారు. ఒక ఉదాహరణను వినండి. యోవేలు 2:22-23లో మనము ఇలా చదువుతాము:

> పశువులారా, భయపడకుడి, గడ్డిబీళ్లలో పచ్చిక మొలుచును, చెట్లు ఫలించును, అంజూరపుచెట్లును, ద్రాక్షచెట్లు సమృద్ధిగా ఫలించును, సీయోను జనులారా, ఉత్సహించి మీ దేవుడైన యెహోవాయందు సంతోషించుడి; తన నీతినిబట్టి ఆయన తొలకరి వర్షమును మీకనుగ్రహించును, వాన కురిపించి పూర్వమందువలె తొలకరి వర్షమును కడవరి వర్షమును మీకనుగ్రహించును (యోవేలు2:22-23).

అదే విధంగా, తన కాలములోని ప్రజలు యెహోవాకు విధేయత చూపినప్పుడు దేవుని ఆశీర్వాదములను చూస్తారు అని జెకర్యా ప్రవచించాడు. జెకర్యా 8:12లో మనము ఈ మాటలను చదువుతాము:

> సమాధానసూచకమైన ద్రాక్ష చెట్లు ఫలమిచ్చును, భూమి పండును, ఆకాశమునుండి మంచు కురియును, ఈ జనులలో శేషించినవారికి వీటి నన్నిటిని నేను స్వాస్థ్యముగా ఇత్తును (జెకర్యా 8:12).

## యుద్ధము ద్వారా ఆశీర్వాదము

నిబంధనా ఆశీర్వాదముల యొక్క మొదటి రకము ప్రకృతి సమృద్ధి మీద దృష్టిపెడుతుంది, మరియు రెండవ ప్రధాన రకము తరచుగా ప్రవక్తల గ్రంథములలో కనిపిస్తుంది, అది యుద్ధము ద్వారా ఆశీర్వాదము. నిబంధనా ప్రజలు దేవుని తీర్పులో ఉన్నప్పుడు యుద్ధములో ఓటమిని చవి చూసినట్లే, నిబంధనా ఆశీర్వాదములలో ఉన్నప్పుడు విజయము మరియు సమాధానమును చవి చూస్తారు. ఈ అంశము ద్వితీయోపదేశకాండము 4, 28, 30 మరియు లేవీయకాండము 26లో కనీసము నాలుగు విధాలుగా కనిపిస్తుంది. మొదటిగా, దేవుని ప్రజలు తమ శత్రువులను ఓడిస్తారని మోషే వారికి చెప్పాడు. అయితే దీనికి మించి, యుద్ధముకు ముగింపు ఉంటుంది; రాజ్యములతో ఉన్న శత్రుత్వం ఆగిపోతుంది మరియు విధ్వంసాలన్నిటి నుండి ఉపశమనం లభిస్తుంది. మరియు, వాస్తవంగా చెప్పాలంటే, వాగ్దాన దేశము నుండి తీసుకొనిపోబడి చెరలో ఉన్నవారు తిరిగివస్తారు.

యుద్ధము ద్వారా కలుగు ఈ విధమైన ఆశీర్వాదములను గూర్చి పాత నిబంధన ప్రవక్తలు పదే పదే మాట్లాడారు. ఇశ్రాయేలు రాజ్యము యొక్క సైనిక విజయమును గూర్చిన గొప్ప భవిష్యత్తును ఆమోసు ఎలా చెప్పాడో వినండి. ఆమోసు 9:11-12లో, చెర-తరువాత కాలమును గూర్చి అతడు ఈ మాటలు మాట్లాడాడు:

> పడిపోయిన దావీదు గుడారమును ఆ దినమున నేను లేవనెత్తి దాని గోడను బాగుచేసి దాని పోయిన చోట్లను బాగుచేసి, ఎదోము శేషమును నా నామము ధరించిన అన్యజనులనందరిని ... పూర్వపురీతిగా దానిని మరల కట్టుదును (ఆమోసు 9:11-12).



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

వైరము మరియు సమస్యలతో కూడిన లోకములో, దావీదు కుటుంబము శత్రువులందరి మీద విజయం సాధిస్తుందని ప్రవక్తయైన ఆమోసు ప్రకటించాడు. అదే విధంగా, ఈ విజయము ద్వారా గొప్ప సమాధానము ఉంటుందని మీకా 4:3లో ప్రకటించబడింది:

> వారు తమ ఖడ్గములను నాగటి నక్కులుగాను తమ యీటెలను మచ్చు కత్తులు గాను సాగకొట్టుదురు, జనము మీదికి జనము ఖడ్గము ఎత్తక యుండును, యుద్ధముచేయ నేర్చుకొనుట జనులు ఇక మానివేతురు (మీకా 4:3).

ప్రవక్తలు తమ్మునుతాము కృప మరియు దేవుని ఆశీర్వాదము వైపు త్రిప్పుకున్నట్లు ఈ వాక్యభాగముల ద్వారా మనం చూడవచ్చు. ప్రవక్తలు తీర్పు మరియు పాపమును గూర్చి చెప్పడానికి అభావార్ధకమైన విషయాలు చాలా ఉన్నప్పటికీ, పశ్చాత్తాపము మరియు నమ్మకము ప్రకృతి ద్వారా మరియు యుద్ధము ద్వారా గొప్ప ఆశీర్వాదములను కలిగిస్తాయని కూడా ప్రవక్తలు చెప్పారు.

దేవుడు తన ప్రజలకు అనుగ్రహించు ఆశీర్వాదముల రకములను ఇప్పటివరకు మనము చూశాము గనుక, ఈ ఆశీర్వాదములు ఎటువంటి ప్రక్రియల ద్వారా వస్తాయో కూడా మనం చూడాలి.

## ఆశీర్వాదముల ప్రక్రియ

తీర్పు ప్రక్రియ ఉన్నట్లుగానే, ఆశీర్వాదముల ప్రక్రియ కూడా ఉంది. దేవుని ఆశీర్వాద ప్రక్రియను నియత్రించే కనీసం మూడు సూత్రములు ఉన్నాయి: మొదటిగా, కృప ద్వారా ఆశీర్వాదములు కలుగుతాయి; తరువాత, ఆశీర్వాదములు అంచలంచలుగా కలుగుతాయి; మరియు చివరిగా దేవుని ఆశీర్వాదములకు ముగింపు ఉంటుంది.

### కృప

పాత నిబంధన ప్రజలు దేవుని యెదుట తమ రక్షణను మరియు నీతిని సంపాదించుకున్నారను అభిప్రాయమును చాలాసార్లు ఆధునిక క్రైస్తవులు కలిగియున్నారు. కాని సత్యము మరుగుచేయబడలేదు. ప్రవక్తలు స్త్రీ పురుషులకు క్రియల ద్వారా రక్షణ మార్గమును అందించలేదు. పశ్చాత్తాపపడి దేవుని దయను వెదకాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. హోషేయ 14:1-2లో, మనము ఈ మాటలు చదువుతాము:

> ఇశ్రాయేలూ, నీ పాపముచేత నీవు కూలితివి గనుక నీ దేవుడైన యెహోవాతట్టుకు తిరుగుము. ... మీరు ఆయనతో చెప్పవలసినదేమనగా మా పాపములన్నిటిని పరిహరింపుము; నీకు మా పెదవుల నర్పించుచున్నాము (హోషేయ 14:1-2).

తన పాఠకులు కష్టపడి పని చేసి దేవుని ఆశీర్వాదములు పొందుకోవాలి అని హోషేయ చెప్పలేదు. విరుద్ధంగా, కేవలము దేవుని దయ ద్వారా మాత్రమే ఆశీర్వాదములు వస్తాయి అని నమ్మకమైన ఇశ్రాయేలుకు తెలుసు. నిబంధనా ఆశీర్వాదముకు ఆధారముగా క్షమాపణను వారు వెదకారు – మానవుని యోగ్యత కాదు.

## పరిమాణం

నిబంధనా ఆశీర్వాదములను నియత్రించు రెండవ సూత్రము ఏమనగా అవి అంచలంచలుగా వస్తాయి. తీర్పులు అంచలంచలుగా వచ్చినట్లే, తక్కువ మరియు ఎక్కువ ఆశీర్వాదములను గూర్చి మనం మాట్లాడవచ్చు. కొలబద్ద యొక్క క్రింది భాగములో, పాత నిబంధన ప్రవక్తలు దేవుని యొద్ద నుండి వచ్చిన చిన్నచిన్న దయ కార్యములను గూర్చి మాట్లాడారు. ఉదాహరణకు, నీవు రోగియై మరణించబోతున్నావని యెషయా హిజ్కియాతో చెప్పినట్లుగానే, దేవుడు నిన్ను బ్రదుకనిస్తాడు అని చెప్పినప్పుడు, అతడు రాజుకు చిన్న ఆశీర్వాదమును గూర్చి కూడా ప్రకటించాడు. యెషయా 38:5లో, దేవుడు ఇలా సెలవిచ్చాడు:

> నీవు తిరిగి హిజ్కియా యొద్దకు పోయి అతనితో ఇట్లనుము, "నీ పితరుడైన దావీదునకు దేవుడైన యెహోవా నీకు సెలవిచ్చున దేమనగా: నీవు కన్నీళ్లు విడుచుట చూచితిని; నీ ప్రార్థన నేనంగీకరించియున్నాను; ఇంక పదిహేను సంవత్సరముల ఆయుష్యము నీకిచ్చెదను (యెషయా 38:5).

అనేక ప్రవచనములు ఈ విధమైన వ్యక్తిగత ఆశీర్వాదముల మీద దృష్టిపెడతాయి. అయితే అనేకసార్లు, ప్రవక్తలు దేవుడు తన ప్రజలకు అనుగ్రహించే గొప్ప జాతీయ ఆశీర్వాదముల మీద కూడా దృష్టిపెట్టారు. ఉదాహరణకు, 701లో అష్షూరీయులు యూదా దేశము మీద దాడిచేసి యెరూషలేము ద్వారముల యొద్దకు వచ్చారు. యెషయా 37:34-35లో, ప్రజలను ఈ గొప్ప ఓటమి నుండి దేవుడు విమోచిస్తాడని ప్రవక్త స్పష్టముగా చెప్పాడు.

> "ఈ పట్టణము లోపలికి రాక తాను వచ్చిన మార్గముననే అతడు తిరిగిపోవును; ఇదే యెహోవా వాక్కు. నా నిమిత్తమును నా సేవకుడైన దావీదు నిమిత్తమును నేను ఈ పట్టణమును కాపాడి రక్షించుదును (యెషయా 37:34-35).

ఇది దేవుని ప్రజలకు గొప్ప ఆశీర్వాదముగా ఉంది ఎందుకంటే వారి యొక్క ఉనికికి భంగం కలిగినప్పుడు, యుద్ధములో జయమను ఆశీర్వాదమును అనుగ్రహిస్తానని దేవుడు సెలవిచ్చాడు. మనము పాత నిబంధన గ్రంథమును చదవునప్పుడు, దేవుడు తన నిబంధనా ప్రజలకు ప్రకటించిన చిన్న మరియు గొప్ప ఆశీర్వదముల విషయములో ఎల్లప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

## ముగింపు

దేవుని కృప మరియు ఆశీర్వాదముల పరిమాణముతో పాటుగా, నిబంధనా ఆశీర్వాదములను మూడవ సూత్రము కూడా నియంత్రిస్తుంది – శేషించిన ప్రజల పునరుద్ధరణ ద్వారా ముగింపు. తీర్పు ఎంత తీవ్రంగా వచ్చినా, ఎల్లప్పుడు శేషము అనేది మాత్రం ఉంటుందని పాత నిబంధన ప్రవక్తలు నమ్మారు. ఇప్పుడు, ప్రజలు ఏ విధముగా స్పందించారు అను విషయమును బట్టి ఈ శేషము ఎక్కువగా ఉండొచ్చు లేదా తక్కువగా ఉండొచ్చు. అయితే దేవుడు శేషమును సురక్షితముగా ఉంచి, ఆ శేషము మీద నిర్మిస్తాడని ప్రవక్తలు ఎల్లప్పుడు చెప్పారు. ఉదాహరణకు, యెరూషలేము పూర్తిగా నాశనమవుతుందని

యిర్మీయా చెప్పాడు, అయితే యిర్మీయా 5:18లో, శేషము మనుగడను సాగిస్తుందని ప్రజలకు అతడు భరోసా ఇచ్చాడు:

> "అయినను ఆ దినములలో నేను మిమ్మును శేషము లేకుండ నశింపజేతును;
> ఇదే యెహోవా వాక్కు" (యిర్మీయా 5:18).

శేషము యొక్క మనుగడ అనేది చాలా ప్రాముఖ్యమైనది, ఎందుకంటే దేవుడు తన ప్రజలకు శేషము ద్వారానే గొప్ప ఆశీర్వాదమును ఇస్తానని వాగ్దానం చేశాడు.

దేశము నుండి చెరగొనిపోబడుట భయంకరమైన నిబంధనా శాపము అని లేవీయకాండము 26లో మనం చూశాము. అయితే లేవీయకాండము 26:40-45లో, అదే విధంగా ద్వితీయోపదేశకాండము 4 మరియు ద్వితీయోపదేశకాండము 30లో, దేవుడు శేషమును సురక్షితముగా ఉంచి, వారిని దేశముకు తిరిగి తీసుకొనివచ్చి, మునుపటి కంటే గొప్పగా ఆశీర్వదిస్తానని వాగ్దానం చేశాడు. ద్వితీయోపదేశకాండము 30:4-5లో ఈ విషయమును గూర్చి మోషే ఏమి చెప్పాడో వినండి:

> మీలో నెవరైన ఆకాశ దిగంతములకు వెళ్ళగొట్టబడినను అక్కడనుండి నీ దేవుడైన యెహోవా మిమ్మును సమకూర్చి అక్కడనుండి రప్పించును. నీ పితరులకు స్వాధీన పరచిన దేశమున నీ దేవుడైన యెహోవా నిన్ను చేర్చును, నీవు దాని స్వాధీనపరచు కొందువు; ఆయన నీకు మేలుచేసి నీ పితరులకంటె నిన్ను విస్తరింప జేయును (ద్వితీయోపదేశకాండము 30:4-5).

శేషము యొక్క పునరుద్ధరణ అను అంశము ప్రవచన గ్రంథములన్నిటా కనిపిస్తుంది. ఉదాహరణకు, చెర తరువాత దేవుడు ఆయన యొక్క శేషముకు సాధారణ ఆశీర్వాదములు అనుగ్రహిస్తాడని యిర్మీయా బోధించాడు. యిర్మీయా 23:3లో, యిర్మీయా దేవుని యొక్క ఈ మాటలను నివేదించాడు:

> మరియు నేను వాటిని తోలి వేసిన దేశములన్నిటిలోనుండి నా గొఱ్ఱల శేషమును సమకూర్చి తమ దొడ్లకు వాటిని రప్పించెదను; అవి అభివృద్ధిపొంది విస్తరించును (యిర్మీయా 23:3).

అదే విధంగా, చెర తరువాత, యుద్ధములో శేషము కూడా గొప్ప ఆశీర్వాదములు పొందుకొంటుంది. దేవుని ప్రజలు తిరిగి వచ్చిన తరువాత, ఈ శేషము విజయమును మరియు సమాధానమును అనుభవిస్తుందని ప్రవక్తయైన యోవేలు బోధించాడు. యోవేలు 3:9లో, మనము ఈ మాటలు చదువుతాము:

> అన్యజనులకు ఈ సమాచారము ప్రకటనచేయుడి: యుద్ధము ప్రతిష్ఠించుడి, బలాఢ్యులను రేపుడి, యోధులందరు సిద్ధపడి రావలెను (యోవేలు 3:9).

అయితే 3:17లో, ఇశ్రాయేలు విజయమును గూర్చి మనము చదువుతాము:



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

> **అన్యులికమీదట దానిలో సంచరింపకుండ యెరూషలేము పరి శుద్ధపట్టణముగా ఉండును; మీ దేవుడనైన యెహోవాను నేనే, నాకు ప్రతిష్ఠితమగు సీయోను పర్వతమందు నివసించుచున్నానని మీరు తెలిసికొందురు (యోవేలు3:17).**

యుద్ధములో గొప్ప విజయము గూర్చి యోవేలు మాట్లాడాడు, అది ఇశ్రాయేలును శాశ్వతముగా స్థిరపరుస్తుంది.

పాత నిబంధన ప్రవక్తలందరూ దేవుని శేష ప్రజల యొక్క పునరుద్ధరణ కొరకు ఎదురుచూశారు. చెర అను గొప్ప శిక్ష ఉన్నప్పటకీ కూడా, శేషము పునరుద్ధరణ అను గొప్ప ఆశీర్వాదము పొందుతుందని దేవుడు వాగ్దానం చేశాడు.

## ముగింపు

నిబంధనా క్రియాశీలకములను ప్రవక్తలు ఏ విధంగా అర్థం చేసుకున్నారు అను విషయమును ఈ పాఠంలో మనం అన్వేషించాము మరియు మూడు ప్రధానమైన అంశములను చూశాము: మొదటిగా, దేవుని దయ యొక్క ఆదర్శకములు మరియు మానవుని బాధ్యత. తరువాత, వ్యక్తిగత తీర్పు మొదలుకొని దేశము చెరగొనిపోబడు గొప్ప తీర్పు వరకు ప్రవక్తలు ఎలా హెచ్చరించారో కూడా మనం చూశాము. చివరిగా, దేవుడు తన ప్రజలను చిన్న మార్గములలో తరువాత శేషించిన ప్రజల ద్వారా విమోచించి, చెర తరువాత గొప్ప పునరుద్ధరణ తెస్తాడని కూడా మనం చూశాము. పాత నిబంధన ప్రవక్తలు చెప్పినవాటన్నిటిని ఈ అంశములు, ఈ క్రియాశీలకములు మార్గనిర్దేశం చేశాయి, మరియు పాత నిబంధన ప్రవచన గ్రంథములను చదువుచుండగా, ఈ అంశములు మనకు మార్గనిర్దేశం చేయాలి.